రిపోర్టర్లు కావలెను
పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.
అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం
మరిన్ని వివరాలకు సంప్రదించగలరు
8125972476
క్విక్ టుడే

quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక



EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి సంపుటి : 2 సంచిక 259 సోమవారం 9 జూన్ 2025 | వెల : 3 రూ/.. పేజీలు - 8

# కేబినెట్‌లోకి ముగ్గురికి ఛాన్స్





## సామాజిక న్యాయానికి పెద్దపీట

## ఎస్సీ నుంచివివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్..

## బీసీ నుంచి వాకిటి శ్రీహరికి అవకాశం

## ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విజయశాంతిలకు నిరాశే!

హైదరాబాద్, జూన్8 (క్విక్ టుడే న్యూస్):

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలలకు మొదటిసారిగా కేబినెట్ విస్తరణ చేశారు. కేబినెట్‌లో కొత్తగా ముగ్గురికి అవకాశం ఇచ్చారు. ఎస్సీల నుంచి ఇద్దరు వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, బీసీ సామాజిక వర్గం నుంచి వాకిటి శ్రీహరిలను మంత్రి పదవి వరించింది. వీరికి రాజ్‌భవన్‌లో దర్బార్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం ఉదయం ప్రమాణం చేయించారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్తున్న పలుమార్లు రాష్ట్ర కేబినెట్ విస్తరణ అని ప్రచారం జరిగేది. అదే సమయంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పెద్ది సుదర్శన్, ప్రేమ్ సాగర్ రావు, వివేక్ వెంకటస్వామి, విజయశాంతిలకు కేబినెట్ ఛాన్స్ దక్కుతుందని ప్రచారంలో ఉండేది. మరికొందరు నేతలు సైతం తమకు మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా వారికి ప్రస్తుతం



అవకాశం దక్కలేదు. మీనాక్షి నటరాజన్ తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జ్ గా బాధ్యతలు చేపట్టాక పరిస్థితిలో మార్పు వచ్చింది. రాష్ట్ర మంత్రులతో పాటు సీనియర్ నేతలు, కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించిన తరువాత మాల నుంచి వివేక్, మాదిగ సామాజిక వర్గం నుంచి ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి వాకిటి శ్రీహరిలకు మంత్రి పదవులు ఇచ్చారు. మక్తల్ నియోజకవర్గానికి వాకిటి శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రమాణ స్వీకారోత్స వానికి సీఎం రేవంత్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, దామోదర రాజనర్సింహా, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధనసరి అనసూయ, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డిజిపి జితేందర్, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మాగంటి గోపీనాథ్ కన్నుమూత

## తుదిశ్వాస విడిచిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

## ఛాతినొప్పితో ఏఐజీ ఆస్పత్రిలో చేరిక

## చికిత్సపొందుతూ ఆదివారం మృతి

## అధికారిక లాంచనాలతో ముగిసిన అంత్యక్రియలు

## పాడెమోసిన హరీశ్‌రావు, కేటీఆర్

హైదరాబాద్, జూన్8 (క్విక్ టుడే న్యూస్):

బీఆర్ఎస్ పార్టీకి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదివారం ఉదయం కన్నుమూశారు. జూన్ 5న ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు ఆయనను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. డాక్టర్లు సీపీఆర్ చేయడంతో గుండె తిరిగి కొట్టుకోవడంతో ప్రాణాపాయం తప్పిందని అంతా అనుకున్నారు. నాడి సాధారణ స్థితికి వచ్చినా ఆయన కోమా నుంచి బయటకు రాలేదు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారు జామున మాగంటి గోపీనాథ్ (62) కన్నుమూశారని వైద్యులు తెలిపారు. గోపీనాథ్ మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సానుభూతి తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో బీఆర్ఎస్ నేత మాగంటి అంత్యక్రియలు నిర్వహించింది. అంతకుముందు మాదాపూర్ లోని నివాసం నుంచి మాగంటి గోపీనాథ్ అంతిమయాత్ర మొదలైంది. మహాప్రస్థానం వరకు ర్యాలీగా మాగంటి గోపీనాథ్ భౌతికకాయాన్ని తరలించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అంతిమయాత్రలో పాల్గొని మాగంటి గోపీనాథ్ పాడె మోశారు.